

సవారీ బంగ్లా షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, నాయకులు

# అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- సవారీ బంగ్లా ప్రారంభం

ఎదులాపురం, జూలై 19 : రాష్ట్రం ఏర్పడిన తర్వాత కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదీవేనగర్‌లో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సవారీ బంగ్లాను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి బంగ్లాను ప్రారంభించారు. ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. నియోజకవర్గంలో దాదాపు రూ.7 కోట్లతో సవారీ బంగ్లాలు,షెడ్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మందిరాలు, చర్చిలు, మసీదులు, బుద్ధవిహార్ల అభివృద్ధికి కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతున్నదని పేర్కొన్నారు. కుల, మతాల తేడా చూపకుండా సమగ్ర అభ్యున్నతికి పాటు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, కౌన్సిలర్ కోవ రవి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అలాల్ అజయ్ కుమార్, నల్ల మహేందర్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా ఐటీ టవర్

- ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, జూలై 19 : ఆదిలాబాద్ చరిత్రలో నిలిచిపోయేలా జిల్లాకేంద్రంలోని ఐటీ టవర్ నిర్మాణాన్ని చేపట్టనున్నామని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు పరిధిలో నిర్మిస్తున్న ఐటీ టవర్ పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన పనులను పర్యవేక్షించారు. రూ.40 కోట్లతో వెయ్యి మంది ఐటీ కంపెనీల్లో పని చేసే సామర్థ్యంతో టవర్‌ను నిర్మించనున్నామన్నారు. ఇందుకోసం మూడెకరాల భూమిని ప్రభుత్వమే కేటాయించిందని తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయి పనులను మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకోనున్నామని చెప్పారు. ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో పట్టణంలో ఐటీ టవర్ నిర్మాణం ప్రారంభమైందని, ఇందు కోసం దాదాపు రూ.15 కోట్ల విలువైన భూమిని సైతం కేటాయించినట్లు తెలిపారు. ప్పటికే ఎన్‌టీటీ డేటా కంపెనీకి సంబంధించి తాత్కాలిక భవనంలో ఐటీ సేవలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అక్కడ కూడా వసతుల కల్పనకు రూ.1.36 కోట్లను మంత్రి కేటీఆర్ చొరవతో ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఐటీ టవర్ నిర్మాణం జిల్లా చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయమని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నేతలు మాత్రం ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు చేయడం వారి చేతకాని తనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తాజాగా పట్టణాభివృద్ధిలో భాగంగా చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ సప్లై కోసం రూ.320 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడుతున్న వారిని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్ పవన్ నాయక్, విలాస్, కలీం పాల్గొన్నారు.

# గోదావరికి మర్వాడీ మహిళల పూజలు

బాసర, జూలై 19 : బాసర గోదావరి ఘాట్ వద్ద బుధవారం మార్వాడీ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 21 మంది నారీ మనోరత్ కార్యక్రమంలో భాగంగా గోదావరికి 21 చీరలు సమర్పించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంజీవ్ పాల్గొని వారితో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆశీర్వచనాలు అందించారు.



గోదావరి వద్ద పూజలు నిర్వహిస్తున్న మార్వాడీ మహిళలు

# అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష



గిరి సబ్బుల తయారీ కర్మాగారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ టౌన్, జూలై 19 : నిర్మల్ జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర వాతావరణశాఖ సూచించినందున జిల్లా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ కార్యాలయంలో ఆయా మండలాల అధికారులతో బుధవారం మాట్లాడారు. వర్షాలతో జరిగే నష్టాన్ని నివారించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వాతావరణశాఖ నిర్మల్ జిల్లాను రెడ్‌జోన్‌గా ప్రకటించిందని గుర్తుచేశారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలు వరద తాకిడికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వాగులు, కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని, అధికారులు ముందస్తు అనుమతి లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరదలతో నష్టపోకుండా ఉండేందుకు కలెక్టర్ కార్యాలయంలో 24 గంటల హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. హెల్ప్‌లైన్ నంబర్ 93987 49227లో సంప్రదించాలని కోరారు.

**పట్టణంలో విస్తృత పర్యటన..**

నిర్మల్ పట్టణంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ, తహసీల్దార్ గెస్ట్‌హౌస్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలాలను పరిశీలించారు. అంతకుముందు వైకుంఠధామం నిర్మాణ పనులతో పాటు సోఫీనగర్‌లోని విజయ డెయిరీఫాం, తేనెశుద్ధి కర్మగారాన్ని పరిశీలించి పలు వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం తేనె శుద్ధి కర్మగారానికి వస్తున్న తేనె, మార్కెటింగ్, అక్కడ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సబ్బుల పరిశ్రమను పరిశీలించిన ఆయన.. గిరి సబ్బుల ప్రాధాన్యత గురించి తెలుసుకున్నారు. మార్కెటింగ్ చేసేందుకు మరింత ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. విజయ డెయిరీ పాల ఎగుమతులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. పాల మార్కెటింగ్ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**డీఆర్డీఏ అధికారులతో సమీక్ష..**

డీఆర్డీఏ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలపై కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాలు, స్త్రీనిధి రుణాల లక్ష్యం, కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సాహం అందించాలని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించాలని సూచించారు. అర్హులైన వారికి పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతినెలా సక్రమంగా అందేలా సిబ్బంది చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం అందిద్దాం

- 1-19 ఏళ్లలోపు వారికి అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి
- అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ
- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, డీఈవోలు

ఎదులాపురం, జూలై 19 : చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే సూక్ష్మ జీవులు (పరాన్న జీవులు) నులి పురుగులని, వీటిని నిర్మూలించాలనే ఉద్దేశంతో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులిపురుగులతో చిన్నారుల్లో పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, శక్తిహీనత వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. 1-19 యేండ్ల వయసున్న పిల్లలు కొందరు పౌష్టికాహార లోపంతో బాధపడుతుంటే, ఇంకొందరు నులి పురుగుల బారినపడి అనారోగ్యం పాలవుతారని తెలిపారు. చిన్న వయసులోనే పిల్లల్లో నులి పురుగులను నివారిస్తే వారిలో వ్యాధి నిరోధకత పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. జిల్లాలో 1-19 ఏండ్ల వయసున్న వారు 1,92,725 మందిని గుర్తించామన్నారు. వీరికి గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో 1,256 అంగన్‌వాడీ కేంద్రాల్లో 48,727 మంది పిల్లలు, 1,419 పాఠశాలల్లో 1,26,572 మంది పిల్లలు, 48 కళాశాలల్లో 14,625, బడిబయట ఉన్న పిల్లలు 2,801 మంది ఉన్నారని తెలిపారు. ఇందుకుగాను జిల్లాలో ప్రోగ్రాం ఆఫీసర్లు 6, మెడికల్ ఆఫీసర్లు 27, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్లు 16, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు 5, ఎంఈవోలు 18, ఆశ కార్యకర్తలు 1,008, అంగన్‌వాడీ కార్యకర్తలు 1,083 మంది విధులు నిర్వహిస్తారని వివరించారు. ఈ సమావేశంలో డీఐవో వైసీ శ్రీనివాస్, మాస్‌మీడియా అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ సాధ్యం

- ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్
- ఇంద్రవెల్లి మండలం ముత్నూర్‌లో పర్యటన



ముత్నూర్ గ్రామంలో పర్యటిస్తున్న జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్

ఇంద్రవెల్లి, జూలై 19 : వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తేనే సీజనల్ వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో బుధవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు ఇంకుడుగుంతలను పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగహన కల్పించారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదామని పేర్కొన్నారు. అధికారులతో ప్రత్యేక సమావేశమై గ్రామంలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతోపాటు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రూపు మహిళలతో శుభ్రతతోపాటు మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణాలతో జరిగే ఆరోగ్య ప్రయోజనాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నదన్నారు. అందరూ కలిసికట్టుగా ముత్నూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, జడ్పీ సీఈవో గణపతి, సర్పంచ్ తుంరం భాగుబాయి, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఈజీఎస్ ఈసీ జాదవ్ శ్రీనివాస్, ఈజీఎస్ టీఏ సంతోష్‌జైస్వాల్, ప్రకాశ్, మహేందర్, ఐకేపీ సీసీలు సూర్యకాంత్, శ్రీరాం, మోతీరాం, మాజీ ఎంపీపీ కనక తుకారాం, జీవ వైవిధ్య జిల్లా కమిటీ సభ్యుడు మర్సుకోల తిరుపతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండీ జునైద్, కోవ మనోజ్‌కుమార్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.